
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

కృష్ణా జిల్లా వార్తలు
బుధవారం 15 మే 2024



జిల్లాలో పోలింగ్ కేంద్రాల వద్ద అర్ధరాత్రి వరకూ బారులుతీరిన ఓటర్లు

పోలింగ్ @ 84.45%

- పెడనలో అత్యధికంగా 88.57 శాతం
- పెనమలూరులో అత్యల్పంగా 79.14 శాతం
- నాలుగు నియోజకవర్గాల్లో గతం కన్నా పెరిగిన పోలింగ్
- మూడు నియోజకవర్గాల్లో స్వల్పంగా తగ్గదల

కసి తీరా పోట్లాడటం చూసి ఉంటాం. కొట్లాడటం చూసి ఉంటాం. కసి తీరా పోరాడటం కూడా చూసి ఉంటాం. కానీ కసి తీరా ఓట్లు వేయడం చూశారా? ఈ ఎన్నికల్లో అదే జరిగింది. ఓటర్లు ఎండకు భయపడలేదు. వానకు వెరవలేదు. చాంతాడంత క్యూలు ఉన్నా వెనుదిరగలేదు. సమయంతో పనిలేదు. ఆకలి దప్పులు తెలియలేదు. ఒకటే లక్ష్యం. ఎంతసేపు అయినా సరే ఓటు వేసి వెళ్లాలనే పట్టుదలే కనిపించింది. పొరుగు రాష్ట్రాల నుంచి వెల్లువలా తరలివచ్చి కొందరు.. ఖర్చుకు వెనుకాడకుండా ఖండాంతరాలు దాటి వచ్చి మరికొందరు.. ఇలా ఎక్కువ మంది ఓటు వేయడంతో జిల్లా వ్యాప్తంగా 84.45 శాతం పోలింగ్ నమోదు అయింది. 2019 కన్నా 0.09 శాతం పెరిగింది. పెరిగిన పోలింగ్ ఎటువైపు మొగ్గిందో తెలియాలంటే మరో 19 రోజుల వరకు ఆగాల్సిందే.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో ఓటింగ్ శాతం గతం కన్నా పెరిగింది. 2019 సంవత్సరానికన్నా ఈసారి 0.09 పోలింగ్ పెరిగింది. అత్యధికంగా పెడన నియోజకవర్గంలో 88.57 శాతం పోలింగ్ నమోదైంది. అత్యల్పంగా పెనమలూరు నియోజకవర్గంలో 79.14 శాతం నమోదైంది. గుడివాడ, పెడన, మచిలీపట్నం, పామర్రు నియోజకవర్గాల్లో ఓటింగ్ శాతం గతం కన్నా పెరిగింది. గన్నవరం, అవనిగడ్డ, పెనమలూరు నియోజకవర్గాల్లో గతం కన్నా స్వల్పంగా తగ్గింది. పెరిగిన పోలింగ్ ఏ సామాజికవర్గానికి చెందిన ఓటర్లు తమకు అనుకూలంగా ఓటువేశారనే అంశంపైనా రాజకీయ పార్టీల నాయకులు లెక్కలు కడుతున్నారు. విదేశాల నుంచి, హైదారాబాద్, జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లు ఏ పార్టీకి అనుకూలంగా మళ్లారనే అంశంపైనా ఆరా తీస్తున్నారు. మహిళా ఓటర్లు, సామాజిక పింఛనుదారులు ఏ పార్టీకి అనుకూలంగా ఓట్లు వేశారనే అంశంపైనా లెక్కలు కడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు గంటలతరబడి పోలింగ్ కేంద్రాలవద్ద బారులు తీరి నిలబడి ఉండి ఓటువేసిన తీరు ఏ పార్టీకి మేలు చేస్తుందనే అంశంపైన విశ్లేషణ చేస్తున్నారు. మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో జనసేన పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేసిన వల్లభనేని బాలశౌరికి వైసీపీకి చెందినవారు ఓట్లు వేశారనే ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. ఈ పరిణామాలు ఎటునుంచి ఎటువైపునకు దారితీసి అభ్యర్థుల గెలుపోటములపై ఎంతమేర ప్రభావం చూపుతాయనే అంశంపైనా చర్చ జరుగుతోంది.



వైసీపీ కీలుబొమ్మలు!

గుడివాడ పోలీస్ రూటే సపరేటు

- అధికార పార్టీకి ఒకలా... ప్రతిపక్ష పార్టీలకు మరోలా
- ఐదేళ్లు అధికార పార్టీ సేవలోనే..
- గత, ప్రస్తుత వన్‌టౌన్ సీఐల తీరు వివాదాస్పదం

ఐదేళ్ల వైసీపీ పాలనలో గుడివాడ పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారు. అధికార పార్టీ సేవలో తరించారు. ప్రతిపక్షంపై విరుచుకుపడ్డారు. అడ్డమైన కేసులు పెట్టారు. లాఠీలకు పని చెప్పారు. బెదిరింపులకు పాల్పడ్డారు. టీడీపీ కార్యక్రమాలను అడ్డుకున్నారు. అధికార వైసీపీకి అంటకాగారు. ముఖ్య నేతల చేతుల్లో కీలుబొమ్మల్లా పనిచేశారు. ప్రతిపక్షంపై వైసీపీ నేతలు దాడులకు తెగబడ్డా చూస్తుండిపోయారు. పైగా బాధితులపైనే కేసులు పెట్టారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి నామినేషన్ ఘట్టం ముగిసి.. ప్రచారం పూర్తయ్యేదాకా పోలీసులు ఇదే ధోరణిలో వ్యవహరించారు. - గుడివాడ

టీడీపీ నేతల పట్ల ఒక తీరు..

నామినేషన్, ప్రచారం చివరి రోజున టీడీపీ నాయకులు చేపట్టిన ర్యాలీలో అడ్డంకులను సృష్టించాలనే అధికార పార్టీ హుకుంకు తగ్గట్టు పోలీసులు వ్యవహరించారు. ర్యాలీకి అనుమతులున్నా ఆంక్షల పేరుతో టీడీపీని ఇబ్బందులకు గురిచేశారు. సజావుగా సాగుతున్న ర్యాలీలో నిబంధనల పేరుతో బారికేడ్లు ఏర్పాటు చేసి వన్‌టౌన్ సీఐ కె.ఇంద్ర శ్రీనివాస్ అడ్డుతగిలారు. అటువైపు వెళ్లొద్దంటూ దారి మళ్లించారు. టీడీపీ ర్యాలీ వెళుతున్న సమయంలో కొంతమంది వైసీపీ కార్యకర్తలు బైక్‌లు వేసుకుని చొచ్చుకొచ్చి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. వైసీపీ శ్రేణులను నిలువరించడంలో సీఐ శ్రీనివాస్ తాత్సారం చేశారు. టీడీపీ నాయకులు రావి వెంకటేశ్వరరావు తదితరులపై మాత్రం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

- గతంలో వన్‌టౌన్ సీఐగా పనిచేసిన గోవిందరాజు ఎమ్మెల్యే కొడాలి నాని ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు కనపడితే విరుచుకుపడి, నానా బూతులు తిట్టి, లాఠీచార్జ్ చేసినవి కోకొల్లలు. ఏకంగా టీడీపీ కార్యాలయంపై, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుపై గడ్డంగ్యాంగ్ పెట్రో సంచులతో హత్యాయత్నానికి ప్రయత్నించినా.. వైసీపీ అల్లరిమూకలను నిరోధించకుండా తిరిగి టీడీపీ శ్రేణులపై లాఠీచార్జి చేశారు. గత సీఐ గోవిందరాజును స్ఫూర్తిగా తీసుకుని ప్రస్తుత సీఐ ఇంద్ర శ్రీనివాస్ వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, విధుల్లో చేరిన నాటి నుంచి ఆ పార్టీ సేవలో తరిస్తున్నారని టీడీపీ వర్గాలు బాహటంగా విమర్శిస్తున్నాయి.
- టీడీపీ కార్యాలయంపై పెట్రో సంచులు, కర్రలు, రాడ్లతో వైసీపీ నాయకులు హల్‌చల్ చేసినా పోలీసులకు అవేమీ కనపడలేదు. వైసీపీ అల్లరిమూకలను దీటుగా ఎదుర్కొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వైసీపీ నాయకులపై నామమాత్రపు సెక్షన్‌లు పెట్టి హత్నాయత్నం కేసును నీరుగార్చారు.

వైసీపీ పట్ల మరో తీరు..

- గుడివాడ మండలం వలివర్తిపాడులోని రీసర్వే నెం.180లో 66 మందికిపైగా చెందిన ప్లాట్‌లను వైసీపీ నేతలు కబ్జా చేశారు. ఈ వ్యవహారంలో నాని ముఖ్య అనుచరుడిపై తాలుకా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనా దర్యాప్తు ముందుకు సాగలేదు. కనీసం అరెస్టు కూడా చేయలేదు.
- గుడివాడ పరిధిలో వైసీపీ నాయకులు... ప్రతిపక్షాలపై చేసిన దాడులను, పేకాట క్లబ్‌ల నిర్వహణను, క్రికెట్ బెట్టింగ్‌ను, గంజాయిని నిరోధించడంలో పోలీసులు అలసత్వం పాటించారు.
- ఐపీఎల్ నడుస్తున్న క్రమంలో బెట్టింగ్ మాఫియా పట్ల పోలీసులు ఉదారతను కనబరుస్తున్నారు. వైసీపీకి చెందిన నాయకుడొకడు క్రికెట్ బెట్టింగ్ నిర్వహించడంలో సిద్ధహస్తుడు. అతనికి అన్నివిధాలుగా సహకరిస్తూ తమ జేబులను నింపుకుంటున్నారు. ఇటీవల ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత బెట్టింగ్‌లు నిర్వహించే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అధికార పార్టీ ఎమ్మెల్యే సిఫారసుతో వదిలేశారని పట్టణ ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు.
- గుడివాడ నియోజకవర్గ పరిధిలో పేకాట శిబిరాలు నిరాటంకంగా సాగాయి. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో నిర్వహించిన పేకాట శిబిరాలపై ఏనాడూ గుడివాడ పోలీసులు దాడులు నిర్వహించిన దాఖలాలు లేవు.

గంజాయి అమ్మకాల్లో వాటాలా?

విచ్చలవిడిగా గుడివాడలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయి. గతంలో వన్‌టౌన్‌లో పనిచేసిన సీఐ అధికార పార్టీకి చెందిన గంజాయి విక్రయదారులకు అండగా నిలిచి భారీ మొత్తంలో వాటాలు పొందినట్లు వినికిడి. ఈ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయాలు కొద్ది మేర తగ్గాయి. ఇటీవల ఒక కేసు విషయంలో ఒక కుటుంబాన్ని గంజాయి కేసులో ఇరికించేందుకు ప్రయత్నించి విఫలమైన విషయం విదితమే. ఈ వ్యవహారంలో యువకులు బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడి ఏకంగా సీఐ పేరు చెప్పి పెద్ద మొత్తంలో నగదును డిమాండ్ చేసిన విషయం విదితమే. సదరు వన్‌టౌన్ సీఐ వ్యవహార శైలి పట్ల పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి.

ఎవరి లెక్కల్లో వారు!



ఓట్ల లెక్కల్లో తలమునకలైన ప్రధాన పార్టీల అభ్యర్థులు

ఎన్నికల ఘట్టంలో కీలకమైన పోలింగ్ ప్రక్రియ ముగిసింది. తుది అంకమైన కౌంటింగ్‌కు 19 రోజులు ఉంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు పూర్తయితే కానీ ఎవరి భవిష్యత్తు ఏమిటనేది తేటతెల్లమవ్వదు. అయితే పోలింగ్ సరళి.. ఓటర్ల అభిప్రాయాలను ఆధారంగా చేసుకుని ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరి లెక్కల్లో వారు మునిగితేలుతున్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని 2 పార్లమెంటు, 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల తరఫున పోటీ చేసిన అభ్యర్థులు మండలాలు.. గ్రామాల వారీగా ఓటింగ్ సరళిని తెప్పించుకుని ఎవరెవరికి ఎన్ని ఓట్లు పడ్డాయనే విశ్లేషణ చేసుకుంటున్నారు. పోలింగ్ శాతం గత ఎన్నికల కన్నా పెరిగిన నేపథ్యంలో పెరిగిన ఓట్లు ఎవరికి పడ్డాయన్న అంచనాలు వేసుకుంటున్నారు.

- మండలాలు.. గ్రామాల వారీగా విశ్లేషణ
- విజయవాడలో పెరిగిన పోలింగ్ శాతం
- టీడీపీవైపు మొగ్గిన ఎన్ఆర్ఐలు, పొరుగు రాష్ట్రాల ఓటర్లు
- మెజారిటీలపైనా అభ్యర్థుల మల్లగుల్లాలు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ పార్లమెంటు పరిధిలో 79.36 శాతం ఓటింగ్ నమోదైంది. కృష్ణా జిల్లాలో 84.45 శాతం ఓటింగ్ నమోదైంది. ఈసారి విదేశాల్లో ఉన్న వారు, పొరుగు రాష్ట్రాల్లో ఉన్నవారు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వీరి ఓట్లతోపాటు ప్రభుత్వ వ్యతిరేక ఓటు కలిసి పోలింగ్ శాతం గణనీయంగా పెరిగిందని భావిస్తున్నారు. తొలి సారి ఓటు వినియోగించుకున్న వారి సంఖ్య కూడా ఈసారి భాగా పెరిగింది. ఇవన్నీ ఎవరికి కలిసి వస్తాయన్న విశ్లేషణలు జోరుగా సాగుతున్నాయి. విజయవాడ నగరంలో మూడు నియోజకవర్గాలు ఉండగా సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో ఓటింగ్ శాతం గతంలో కన్నా గణనీయంగా పెరిగింది. ఇక్కడ వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన వెలంపల్లి శ్రీనివాసరావు.. పెరిగిన ఓటింగ్ తమ ప్రభుత్వ పథకాలకు మెచ్చి వచ్చిందని లెక్కలు వేసుకుంటున్నారు. మహిళలు పెద్ద ఎత్తున జగన్ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారని అందుకే ఓటింగ్ శాతం ఈ స్థాయిలో పెరిగిందని వైసీపీ శిబిరం భావిస్తోంది. అయితే ప్రభుత్వంపై వ్యతిరేకతతో గతంలో ఓటు వేయడానికి బయటకు రాని మధ్య, ఎగువ మధ్యతరగతి వర్గాలు భారీగా రావడం వల్లే ఓటింగ్ శాతం పెరిగిందని టీడీపీ అభ్యర్థి బొండా ఉమా శిబిరం లెక్కలు వేస్తోంది. మహిళల్లో కూడా ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రస్థాయిలో ఉందని తప్పకుండా పెరిగిన ఓట్లు తమకే పడతాయని టీడీపీ నాయకులు చెబుతున్నారు.

- విజయవాడ పశ్చిమలో ముస్లిం ఓటర్లు కీలకంగా ఉంటారు. ఈసారి వారంతా పార్టీలకతీతంగా వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆసిఫ్‌ను బలపర్చారన్న ప్రచారం జరుగుతోంది. దీంతో మిగిలిన ఓటర్లలో కీలకంగా ఉన్న బీసీల ఓట్లు ఎటువైపు పడ్డాయన్న దానిపై ఇక్కడ గెలుపు ఆధారపడి ఉంది. బీసీ ఓట్లతోపాటు మిగిలిన సామాజికవర్గాల ఓట్లలో అధికశాతం తమకే పడ్డాయని గెలుపు పక్కా అని బీజేపీ నాయకులు విశ్లేషిస్తున్నారు.
- రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తున్న విజయవాడ తూర్పులో గత ఎన్నికల్లో 67.50 శాతం ఓట్లు పోలవ్వగా ఈసారి గణనీయంగా పెరిగి 71.33 శాతం పోలయ్యాయి. విజయవాడ తూర్పులో.. ఎన్ఆర్ఐ ఓటర్లు, పొరుగురాష్ట్రాల నుంచి వచ్చిన వారు, తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న వారు గణనీయంగా ఉన్నారు. వీరంతా టీడీపీ ఓటర్లేనని టీడీపీ నాయకులు విశ్లేషిస్తున్నారు. గతంలో వైసీపీకి కొమ్ముకాసిన కృష్ణలంక, గుణదల వంటి ప్రాంతాల్లోనూ ఈసారి టీడీపీ ఆధిక్యం సాధిస్తుందని లెక్కలు వేస్తున్నారు.
- పామర్రు నియోజకవర్గంలోని పెదపారుపూడి, మొవ్వ మండలాలకు ఈసారి ఎన్ఆర్ఐ ఓటర్లు, పొరుగు రాష్ట్రాల్లో ఉన్న ఓటర్లు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వీరంతా టీడీపీ ఓటర్లని, వీరితోపాటు ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో తమ గెలుపు ఖాయమని టీడీపీ నాయకులు విశ్లేషిస్తున్నారు. అయితే తోట్లవల్లూరు, పామర్రు పట్టణం, మొవ్వ తదితర మండలాల్లో వైసీపీకి మంచి పట్టు ఉందని, ఆయా మండలాల్లో తిరుగులేని ఆధిక్యాన్ని సాధిస్తామని, పెదపారుపూడి, పమిడిముక్కల్లో గతంలో కన్నా మెజారిటీ తగ్గినా మొత్తం మీద గెలుపు తమదేనని వైసీపీ నాయకులు లెక్కలు వేస్తున్నారు.
- గుడివాడ, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో వార్ వన్‌సైడ్ జరిగిందని టీడీపీ నాయకులు భావిస్తున్నారు. ఈ మూడు నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులుగా నిలబడిన కొడాలి నాని, వల్లభనేని వంశీ, జోగి రమేశ్ వ్యక్తిగతంగా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకున్నారు. దీంతో వైసీపీ ప్రభుత్వ పథకాలు కూడా వీరిని గట్టెక్కించలేవన్నది విశ్లేషకుల అభిప్రాయం.
- మచిలీపట్నం నియోజకవర్గంలో మహిళలు గంపగుత్తగా తమకే వేశారని వైసీపీ నాయకుడు ఒకరు వ్యాఖ్యానించారు. ఈసారి మహిళలే తమ గెలిపించనున్నారని ఆయన వ్యాఖ్యానించారు. అయితే ఈ వాదనను టీడీపీ నాయకులు కొట్టేస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు సైలెంట్ ఓటింగ్‌గా మారి వైసీపీ పునాదులు కూల్చేయనుందని వారు చెబుతున్నారు.
- అవనిగడ్డలో గతంలో కన్నా ఓటింగ్ శాతం తగ్గింది. ఇది దేనికి సంకేతమన్నదానిపై ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. 2019లో 88.11 శాతం ఓట్లు పోలవ్వగా ఈసారి కేవలం 86 శాతమే పోలయ్యాయి. జనసేన ఇక్కడ సునామీ సృష్టించబోతోందన్నది ఆ పార్టీ నాయకుల అంచనా.
- మైలవరంలో కూడా గతంలో కన్నా ఓటింగ్ తగ్గింది. గత ఎన్నికల్లో 89.60 శాతం ఓట్లు పోలవ్వగా ఈసారి 85.36కి పడిపోయింది. గత ఎన్నికల్లో వైసీపీకి వేసిన వారు ఈసారి అంతగా ఆసక్తి చూపకపోవడం వల్లే పోలింగ్ శాతం తగ్గిందని ఇక్కడ టీడీపీ నాయకులు విశ్లేషిస్తున్నారు. సోమవారం ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు పోటెత్తిన ఓటర్లంతా ప్రభుత్వ వ్యతిరేక ఓటర్లేనని గెలుపు తమదేనని టీడీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

కాయ్ రాజా కాయ్..!



పార్టీల గెలుపోటములపై జోరుగా పందేలు

గన్నవరం, గుడివాడ, విజయవాడ తూర్పు, మైలవరం, పెనమలూరు, మచిలీపట్నం అసెంబ్లీ స్థానాలలో టీడీపీ అభ్యర్థుల గెలుపుపై విజయవాడలోని ఓ ప్రైవేటు ఉద్యోగి రూ.3 లక్షలు పందెం కాశాడు. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలలో టీడీపీకి 12 అసెంబ్లీ స్థానాలు దాటుతాయని పెనమలూరుకు చెందిన ఓ మోతుబరి రైతు రూ.5 లక్షలు పందెం కాశాడు. ఈ మోతుబరి 2014 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ కూటమికి జిల్లాలో 10కిపైగా స్థానాలు వస్తాయని పందెం కట్టి రూ.10 లక్షల వరకు సంపాదించాడు. అదే జోరుతో ఈసారి లక్షల్లో పందెం కట్టేందుకు సిద్ధమయ్యారు. జిల్లాలో పోలింగ్ ముగిసిన తర్వాత ప్రధాన పార్టీల గెలుపోటములపై ఏ స్థాయిలో బెట్టింగ్‌లు జరుగుతున్నాయో తెలిపేందుకు ఈ రెండు ఉదంతాలే ఉదాహరణలు.

- ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలో రూ.100 కోట్ల మేర బెట్టింగ్‌లు
- జూన్ 4 నాటికి రూ.500 కోట్లు దాటే చాన్స్
- గన్నవరం, గుడివాడలపై రూపాయికి రెండు రూపాయలు
- విజయవాడ తూర్పు, మైలవరం, పెనమలూరు, మచిలీపట్నంలలో టీడీపీ కచ్చితంగా గెలుస్తుందని పందేలు
- మచిలీపట్నం ఎంపీ, అవనిగడ్డ జనసేన అభ్యర్థుల గెలుపుపైనా అంతే

(విజయవాడ, ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఇప్పుడు బెట్టింగ్ సీజన్ నడుస్తోంది. ఎన్నికల బెట్టింగ్‌కు భారీగా తెర లేచింది. ఎలక్షన్ ముగియటంతోనే పనిలోపనిగా బెట్టింగ్ బాబులు జోరు పెంచారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయి మూడు నాలుగు రోజులు కూడా కాకముందే కాయ్ రాజా కాయ్ అంటూ పందెం రాయుళ్లను వెర్రెక్కిస్తున్నారు. రెండు జిల్లాల్లో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాల్లో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయన్న అంశాన్ని మొదలుకుని కీలకమైన అభ్యర్థులు సాధించే మెజారిటీల వరకు అన్నింటిపైనా బెట్టింగ్‌లు నడుస్తున్నాయి.

- విజయవాడ తూర్పు, మైలవరం, గన్నవరం, పెనమలూరు, మచిలీపట్నం అసెంబ్లీ స్థానాల్లో కూటమి తరఫున టీడీపీ అభ్యర్థులు బలంగా ఉన్నారు. దీంతో ఆయా స్థానాల్లో వారు గెలుపొందే అవకాశాలను బెట్టింగ్ రాయుళ్లు పరిగణనలోకి తీసుకుంటున్నారు.
- మచిలీపట్నం పార్లమెంట్, అవనిగడ్డ అసెంబ్లీ స్థానాలు కచ్చితంగా కూటమి తరఫున జనసేన అభ్యర్థులు గెలుస్తారన్న దానిపై బెట్టింగులు జోరందుకున్నాయి.
- విజయవాడ నగరంలోని మూడు అసెంబ్లీ స్థానాల్లో ఏ పార్టీకి ఎన్నిసీట్లు వస్తాయన్న దానిపైనా లక్షల్లో బెట్టింగ్‌లు జరుగుతున్నాయి.
- తిరువూరు నియోజకవర్గంలో కూటమి, వైసీపీ అభ్యర్థులు ఇద్దరిపైనా బెట్టింగులు జోరుగా జరుగుతున్నాయి.
- కృష్ణాజిల్లాలో మాజీ మంత్రులు ఇద్దరు పోటీ చేస్తున్నారు. గుడివాడ, పెనమలూరు అసెంబ్లీ స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు ఓడిపోతారని బెట్టింగ్‌లు జరుగుతున్నాయి.
- విజయవాడ తూర్పు, మైలవరం నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థుల మెజారిటీపైనా బెట్టింగులు జరుగుతున్నాయి. జగ్గయ్యపేట, నందిగామలో రెండు పార్టీల అభ్యర్థుల ఓట్ల శాతం, గెలుపోటములపై బెట్టింగులు జరుగుతున్నాయి.

రాజకీయ విశ్లేషణల ఆధారంగా బెట్టింగులు

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ప్రధాన పార్టీల గెలుపోటములను విశ్లేషించేందుకు ఆయా పార్టీల వారీగా రాజకీయ నిపుణులు రంగంలోకి దిగారు. వీరు బూత్‌లవారీగా పోలైన ఓట్ల వివరాలు.. వాటిలో యువత ఎంత మంది.. మహిళలు ఎంత మంది.. అన్న వివరాలు సేకరించి పార్టీలకు ఓట్లు ఎలా పడి ఉంటాయన్న అంచనాకు వస్తున్నారు. ఆయా బూత్‌ల్లో పార్టీలకు ఉన్న పట్టును కూడా పరిగణనలోకి తీసుకుని గెలుపోటములను అంచనా వేస్తున్నారు. బూత్‌లవారీగా లెక్కలు వేసుకుని ఒక అంచనాకు వచ్చిన తర్వాత బెట్టింగ్ కోసం సమాచారాన్ని పంపుతున్నారు. బెట్టింగ్ బాబుల్లో అధికశాతం ఈసారి ప్రధాన పార్టీల ద్వితీయశ్రేణి నాయకులే ఉండటం గమనార్హం. జిల్లా స్థాయిలో ఆయా పార్టీల్లో ముఖ్య నేతలుగా ఉన్నవారు కూడా బెట్టింగ్ నిర్వాహకులుగా వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా రాజకీయాల చుట్టూ ఉన్న పందేలు కావటంతో నేతలే కీలకంగా వ్యవహరిస్తున్నారు. కేవలం విజయవాడ నగర పరిధిలోనే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి, వైసీపీకి చెందిన సుమారు వంద మందికిపైగా నేతలు బెట్టింగ్ వ్యవహారానికి కేంద్రంగా మారడం గమనార్హం.

మధ్యవర్తులకు డబ్బేడబ్బు..

ఈసారి బెట్టింగ్ కాసేవారు పక్కాగా వ్యవహరిస్తున్నారు. బెట్టింగ్‌కు ముందుకు వచ్చిన వారు ముందుగా ఓ ఒప్పందం పత్రం రాసుకుంటున్నారు. ఇద్దరూ కలిసి ఒక నమ్మకమైన వ్యక్తి దగ్గర బెట్టింగ్ మొత్తాన్ని ఉంచుతున్నారు. ఫలితం తేలిన తర్వాత ఆ వ్యక్తి ఒప్పందం ఆధారంగా నగదును ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా మధ్యవర్తులుగా ఉన్నవారికీ భారీగానే గిట్టుబాటు అవుతోంది. పందెం మొత్తంలో 5 నుంచి 10 శాతం కమీషన్ రూపేణా మధ్యవర్తులకు అందజేస్తున్నారు. రెండు జిల్లాల్లో ఇప్పటికే సుమారు రూ.100 కోట్ల మేర బెట్టింగ్ జరుగుతున్నట్టు అంచనా. ఫలితాలు వెలువడే తేదీ అయిన జూన్ 4 నాటికి ఈ బెట్టింగ్‌ల మొత్తం రూ.500 కోట్లకు చేరే అవకాశం ఉందని సమాచారం.



దుకాణం వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్

ఓటు అమ్ముకున్న వారికి వస్తువులు అమ్మబడవు

» గుడివాడలో వెలిసిన వినూత్న బ్యానర్

గుడివాడ : ఓటు అమ్ముకోగా వచ్చిన సొమ్ముతో తన షాపులో వస్తువులు అమ్మబడవని గుడివాడకు చెందిన శ్రీసీతారామ రేడియో స్టోర్స్ అధినేత, భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకులు వైవి మురళీకృష్ణ తన దుకాణం వద్ద బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. ఓటర్లను చైతన్యపరుస్తూ ఆయన పట్టణంలో అనేక కార్యక్రమాలను చేపట్టారు. అవినీతి సొమ్ముతో రాజకీయ నేతలు పంచిన సొమ్ములతో తన వద్దకు వస్తువులు కొనడానికి రావద్దని ఏర్పాటు చేశారు. కష్టపడి సంపాదించిన సొమ్ముతోను తన దుకాణంలో కొనాలని కోరారు. ఇలాంటి వారికి ఎటువంటి లాభాపేక్ష లేకుండా వస్తువులను అమ్ముతానని మురళీకృష్ణ పేర్కొన్నారు.



కుటుంబసభ్యులతో గుడివాడ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము

కుటుంబసభ్యులతో వెనిగండ్ల..

100 రోజులకు పైగా నిర్విరామంగా ఎన్నికల సంగ్రామంలో తలమునకలై ప్రజాబాహుళ్యంలో ఉంటూ ప్రశాంతంగా ఎన్నికలు పూర్తిచేసుకొని మంగళవారం కుటుంబ సభ్యులతో వెనిగండ్ల రాము కాస్త సేదతీరారు. గుడివాడలో తనకు సహకరించిన పార్టీ శ్రేణులతో కాసేపు ముచ్చటించిన తర్వాత కుటుంబ సభ్యులతో సహపంక్తి భోజనం చేసి సరదాగా గడిపారు. **గుడ్లవల్లేరు**

జిల్లాలో క్లీన్ స్వీప్ సాధిస్తాం : నెట్టెం రఘురాం



జగ్గయ్యపేట : ఎన్టీఆర్ జిల్లా అసెంబ్లీ స్థానాలతో పాటు, విజయవాడ పార్లమెంట్‌ను గెలుచుకుంటామని పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ధీమా వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభంజనం కనబడిందని, ప్రజా వ్యతిరేకత స్పష్టంగా గోచరించిందని, సోమవారం ఉదయం నుంచి ప్రజలు బారులు తీరటం, మహిళలు పోలింగ్ లో పురుషులతో దీటుగా పాల్గొనటం శుభపరిణామమన్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి 150కి పైగా స్థానాలు గెలుచుకుని చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేయటం ఖాయమన్నారు.



పెడన ఉమ్మడి అభ్యర్థి కాగితకు అభినందనలు తెలుపుతున్న అభిమానులు

కాగిత ఇంట అభిమానుల సందడి..

బంటుమిల్లి: పెడన నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ ఇంటి వద్ద మంగళవారం ఉదయం నుండి అభిమానులు నాయకులు, కార్యకర్తలతో కోలాహలంగా ఉంది. పెడనకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు ఊటుకూరు మోహనరావు, పోతలంక నాగేశ్వరరావులు కాగితను ఘనంగా సన్మానించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎలాంటి భయం లేదని నిర్భయంగా ఉండమని తెలిపారు. అదే విధంగా నాలుగు మండలాల నుంచి నాయకులు, కార్యక్తలు, అభిమానులు ఎన్నికల సరళిని వివరించారు. ఎన్డీఏకు మద్దతుగా వస్తున్న సర్వేలపై చర్చించారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో విశ్వభారతి వైజ్‌వుడ్స్ ప్రభంజనం



ఎ.జాహ్నవి



జి.వర్షిణి

గుడివాడ : సీబీఎస్ఈ-2024 పదో తరగతి, ప్లస్ టూ ఫలితాల్లో విశ్వభారతి వైజ్‌వుడ్స్ పాఠశాల అద్భుత ఫలితాలను సాధించినట్టు పాఠశాల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి ఫలితాల్లో జి.వర్షిణి 487/500 మార్కులు, ప్లస్ టూ ఫలితాల్లో ఆలపాటి జాహ్నవి 475/500 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఉపాధ్యాయుల కృషితో విద్యార్థులు ఇంతటి ఘనవిజయాన్ని సాధించారని పొట్లూరి కొనియాడారు.

» జూన్ 4 వరకు స్ట్రాంగ్ రూముల్లో మూడంచెల భద్రత
» ఇబ్రహీంపట్నం, జూపూడిలోని నోవా, నిమ్రా కళాశాలలకు తరలింపు
» నాలుగు భవనాల్లో 27 స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలు నిక్షిప్తం
» పర్యవేక్షించిన జనరల్ అబ్జర్వర్ మంజూ రాజ్‌పాల్, కలెక్టర్ ఢిల్లీరావు



స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలను పరిశీలిస్తున్న ఢిల్లీరావు



అధికారుల సమక్షంలో స్ట్రాంగ్ రూములకు సీలు వేస్తున్న ఎన్నికల సిబ్బంది



స్ట్రాంగ్ రూముల వద్ద సాయుధ బలగాల పహారా

ప్రజా తీర్పు భద్రం

విజయవాడ/ఇబ్రహీంపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికలు-2024 నిర్ణయాత్మక ప్రజా తీర్పును స్ట్రాంగ్ రూముల్లో ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల యంత్రాంగం భద్రపరిచింది. ఇబ్రహీంపట్నం, జూపూడిలలోని నిమ్రా, నోవా కళాశాలల్లో మొత్తం నాలుగు భవనాల్లో 27 స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలను భద్రపరిచారు. ప్రజా తీర్పు నిక్షిప్తమై ఉన్న ఈవీఎంలను అత్యంత భద్రత నడుమ సోమవారం పోలింగ్ ముగిసిన తర్వాత రిసెప్షన్ సెంటర్లకు తరలించారు. అక్కడి నుంచి ప్రధాన స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. సోమవారం అర్ధరాత్రి వరకు పలు నియోజకవర్గాలలో పోలింగ్ కొనసాగటం వల్ల ఈవీఎంలను రిసెప్షన్ సెంటర్లలో ఉన్న స్ట్రాంగ్ రూమ్‌లలోనే అత్యంత భద్రత నడుమ ఉంచారు. మంగళవారం మధ్యాహ్నం వరకు ఆయా రిసెప్షన్ సెంటర్ల నుంచి ప్రధాన స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంలను తరలించారు. నియోజకవర్గాల వారీగా చూస్తే తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నోవా ఇంజనీరింగ్ కాలేజీలోని ఇంజనీరింగ్ బ్లాక్, బిల్డింగ్-2లోని స్ట్రాంగ్ రూములో ఈవీఎంలను భద్రపరిచారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలను నోవా కాలేజీలోని ఇంజనీరింగ్ బ్లాక్ , బిల్డింగ్-2లో భద్ర పరిచారు. సెంట్రల్ నియోజకవర్గంలోని ఈవీఎంలను నోవా ఇంజనీరింగ్ కాలేజీలోని మెకానికల్ బ్లాక్, బిల్డింగ్-1 లో భద్రపరిచారు. తూర్పు నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలను నిమ్రా ఇంజనీరింగ్ కాలేజీలోని బిల్డింగ్-3 లో భద్రపరిచారు. మైలవరం నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను నిమ్రా మెడికల్ కాలేజీలో మెడికల్ బ్లాక్‌లోని బిల్డింగ్-4లో భద్రపరిచారు. జగ్గయ్యపేట నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలను నిమ్రా ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన బిల్డింగ్-3లో భద్రపరిచారు. ఆయా స్ట్రాంగ్‌రూముల్లో ఈవీఎంలను భద్రపరిచే కార్యక్రమాన్ని జిల్లా జనరల్ అబ్జర్వర్ మంజూ రాజ్‌పాల్, జిల్లా ఎన్నికల అధికారి ఢిల్లీరావులు పర్యవేక్షించారు. స్ట్రాంగ్ రూములకు సింగిల్ డోర్, సింగిల్ కిటికీలు, సింగిల్ వెంటిలేటర్లు ఉన్న రూములనే ఎంచుకున్నారు. ప్రతి స్ట్రాంగ్ రూముకు కూడా డబుల్ లాకింగ్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. షార్ట్ సర్క్యూట్ వంటివి జరగకుండా ఉండటానికి చర్యలు తీసుకున్నారు. వర్షాలు కురిస్తే లీకేజీల కారణంగా సమస్యలు రాకుండా చర్యలు చేపట్టారు. ప్రతి స్ట్రాంగ్ రూమ్‌కు వేసే తాళాల చెవులలో ఒకటి కలెక్టర్ ప్రతినిధి దగ్గర, ఒకటి ఆర్వో వద్ద ఉండేలా చర్యలు చేపట్టారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల మేరకు తరచూ ఈవీఎంలు నిక్షిప్తం చేసిన స్ట్రాంగ్ రూములను రిటర్నింగ్ అధికారులు పరిశీలిస్తుంటారు.

విజయవాడ సెంట్రల్‌లో 7.23శాతం పెరిగిన ఓటింగ్

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : పోలింగ్ పూర్తయింది.. అభ్యర్థులు లెక్కలే తేల్చే పనిలో పడ్డారు. పోలింగ్‌కు ముందు ఒకలా.. పోలింగ్ తర్వాత మరోలా అంచనాలు ఉంటాయి. మంగళవారం నియోజకవర్గాల్లో బూత్‌ల వారీగా జరిగిన పోలింగ్ శాతం వివరాలు వెల్లడికావడంతో అభ్యర్థులు ఆయా బూత్ ఏజెంట్లు, వారికి సారథ్యం వ్యవహించిన నేతలతో సమావేశమయ్యారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో అనూహ్యంగా పోలింగ్ శాతం పెరిగింది. ఇది ఎవరికి లాభిస్తుందో అన్న విషయం చర్చనీయాంశంగా మారింది. సెంట్రల్‌లో 2019 ఎన్నికల్లో 65.73శాతం ఓట్లు పోలయ్యాయి. ఈసారి 72.96శాతం నమోదై 7.23శాతం పోలింగ్ పెరిగింది.

ఎవరి లెక్కలు వారివి..

సెంట్రల్ నియోజకవర్గంలో అభ్యర్థులు స్వల్ప ఓట్లతో గట్టెక్కడం ఆనవాయితీగా వస్తోంది. 2019లో వైసీపీ తరఫున మల్లాది విష్ణువర్ధన్, టీడీపీ తరఫున బొండా ఉమామహేశ్వరరావు పోటీచేయగా ఉమాపై విష్ణు 25ఓట్ల తేడాతో విజయం సాధించారు. ప్రస్తుతం వైసీపీ నుంచి మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, టీడీపీ నుంచి బొండా ఉమామహేశ్వరరావు పోటీ చేశారు. ఇండియా కూటమి అభ్యర్థిగా సీహెచ్ బాబూరావు (సీపీఎం) పోటీలో ఉన్నారు. ప్రధాన పోటీ వైసీపీ, టీడీపీ మధ్య ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. అభ్యర్థుల గెలుపు విషయంలో ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన ఓటింగ్ శాతం తమకే అనుకూలంగా ఉంటుందని నేతలు భావిస్తున్నారు. విజయవాడ సెంట్రల్ క్లిష్టతరమైన నియోజకవర్గం కావడంతో ఈసీ అన్ని పోలింగ్ కేంద్రాల్లోను వెబ్‌క్యాస్టింగ్ ఏర్పాటు చేసింది. 2014లో 65.20శాతం నమోదు కాగా, 2019లో 65.73శాతం నమోదైంది. ఈసారి 72.96శాతం పోలింగ్ నమోదైంది. ప్రభుత్వంపై వ్యతిరేత కారణంగానే ఓటర్లు ఈస్థాయిలో పోటెత్తారని టీడీపీ విశ్వసిస్తోంది. నియోజకవర్గ ఓటర్లు తమ మనసులోని భావన ఎక్కడా బయట పడకుండా జాగ్రత్త పడ్డారు. ఓటరు నాడి మరికొద్ది రోజుల్లో తేలిపోనుంది.

గెలుపెవరిది?



నందిగామలో మల్లగుల్లాలు!

» కూడికలు, తీసివేతల్లో నాయకులు

(కంచికచర్ల) : నందిగామ నియోజకవర్గంలో గెలుపు తమదేనంటూ ప్రధాన పార్టీల అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అన్నివర్గాల్లో మేజార్టీ ఓట్లు తమకే పడ్డాయని, సైలెంట్ ఓటింగ్ తమకే అనుకూలంగా ఉందని ఎవరికి వారే చెప్పుకుంటున్నారు. గ్రామ నాయకుల పోలింగ్ గణాంకాలు.. ముఖ్య నేతల కూడికలు, తీసివేతల్లో నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలో 87.56 శాతం పోలింగ్ జరగ్గా.. మొత్తం 2,05,480 ఓట్లకుగాను 1,79,914 ఓట్లు పోలయ్యాయి. 2019 ఎన్నికల్లో 87.95 శాతం పోలింగ్ జరగ్గా, ఈసారి స్వల్పంగా 0.4 శాతం తగ్గింది. ఈ ఎన్నికల్లో అన్నివర్గాల ఓటర్లు ఉదయం ఆరు గంటలకే పోలింగ్ కేంద్రాలకు వెల్లువలా తరలివచ్చారు. పురుషులకు దీటుగా మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కంచికచర్ల సత్రంబడి, వీరులపాడు మండలం గూడెం మాధవరం, అనాసాగరం, నందిగామలో కొన్ని కేంద్రాల్లో రాత్రి పొద్దుపోయినప్పటికీ ఓటు వేశారు. తొలిసారిగా ఓటు హక్కు పొందిన యువత ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. మార్పు, అభివృద్ధి కోసం ఓటేసినట్టుగా యువ ఓటర్లు పేర్కొన్నారు.

ప్రధాన పార్టీల మధ్యే పోటీ..

నియోజకవర్గంలో తొమ్మిది మంది అభ్యర్థులు ఉన్నప్పటికీ ప్రధాన పార్టీలైన తెలుగుదేశం, వైసీపీ మధ్యే పోటీ నెలకొంది. టీడీపీ అభ్యర్థిగా తంగిరాల సౌమ్య, వైసీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు గెలుపుపై గట్టి ధీమాతో ఉన్నారు. కనిష్టంగా ఐదువేలకు తగ్గకుండా మెజార్టీ వస్తుందని ఇరు పార్టీల నేతలు చెబుతున్నారు.

ఎవరి ధీమా వారిదే..

నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు మండలాల్లో అధిక్యత మెజారిటీ వస్తుందని, వీరులపాడు మండలంలో బ్యాలెన్స్ అవుతుందని టీడీపీ నేతలు లెక్కలు వేస్తున్నారు. రైతులు, మహిళలు, వృద్ధులు, అన్ని వర్గాల ఓటర్లు సైకిల్‌ను ఆదరించారని చెబుతున్నారు. దీంతో టీడీపీ శిబిరంలో రెట్టింపు ఉత్సాహం నెలకొంది. ఇదిలా ఉంటే గెలుపు ఖాయమని, మరోసారి ఓటర్లు తమనే ఆదరించారని వైసీపీ నాయకులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు కనపడలేదని చెపుతున్నారు. వీరులపాడు మండలంలో మెజారిటీ వస్తుందని, కంచికచర్ల, చందరర్లపాడు మండలాల్లో బ్యాలెన్స్ అవుతుందని, నందిగామ మండలంలో కొద్దిగా మైనస్ వచ్చినప్పటికీ గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీకి ఓటమి భయం

- కౌతవరం టీడీపీ నాయకుడిపై దూషణల పర్వం
- కార్యకర్తలను రెచ్చగొడుతున్న వైసీపీ నాయకులు
- పోలీసులకు సుబ్రహ్మణ్యచౌదరి ఫిర్యాదు

గుడ్లవల్లేరు : వైసీపీ నాయకులకు ఓటమి భయం పట్టుకుంది. మండలంలోని కౌతవరంలో మంగళవారం రాత్రి జరిగిన సంఘటనే దీనికి ప్రత్యక్ష నిదర్శనం. కౌతవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మల్లిపెద్ది సుబ్రహ్మణ్య చౌదరిని సమీపంలో ఉండే వైసీపీ కార్యకర్త శింగవరపు కృష్ణప్రసాద్ (సన్ని) మంగళవారం రాత్రి 7గంటల సమయంలో ఇంటికి వెళ్లి అకారణంగా దూషించాడు. కౌతవరం గ్రా మానికి చెందిన వైసీపీ పెద్దలు వడ్లమూడి నాగమోహన్ (చిన్ని), కసుకుర్తి జనార్దన్ (బాబ్జీ) దగ్గరుండి కృష్ణప్రసాద్‌ను రెచ్చగొట్టి తనను దూషించేలా చేశారని బాధితుడు మల్లిపెద్ది సుబ్రహ్మణ్య చౌదరి తెలిపాడు. సుబ్రహ్మణ్య చౌదరిని వైసీపీ కార్యకర్త దూషించడం తెలిసి చుట్టుపక్కల గ్రామాల టీడీపీ కార్యకర్తలు కౌతవరం తరలివచ్చారు. ఈ విషయం తెలిసి పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి టీడీపీ కార్యకర్తలను అక్కడ నుంచి పంపించి వేశారు. గతంలో వెనిగండ్ల రాము తన ఇం టికి వచ్చి వెళ్లిన తర్వాత కూడా కృష్ణప్రసాద్ తనను దూషించాడని సుబ్రహ్మణ్య చౌదరి తెలిపాడు. ఈ మేరకు గుడ్లవల్లేరు పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశాడు.

నిందితులకే కొమ్ముకాస్తారా..

- బాలికపై అత్యాచార యత్నం కేసులో
- పోలీసుల తీరుపై టీడీపీ నేతల ఆగ్రహం
- స్టేషన్ ఎదుట బాలిక బంధువుల ఆందోళన



ఎ.కొండూరు, మే 14 : బాలికపై అత్యాచార యత్నం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేయకపోగా అతడ్ని ఆసుపత్రికి వెళ్లమని సలహా ఇచ్చి కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహించి తిరువూరు కూటమి అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు బాధితులతో కలిసి మంగళవారం రాత్రి ఎ.కొండూరు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. రామచంద్రాపురానికి చెందిన బాలిక (11) స్థానిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. సోమవారం సాయంత్రం కుటుంబసభ్యులు ఓటు వేసేందుకు వెళ్లగా ఇంటి పక్కనే ఉంటున్న మల్లాది చిలకారావు (22) బాలికను చేయిపట్టుకొని పక్కనే ఉన్న ఇంట్లోకి లాకెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. బాలిక పెద్దగా కేకలు వేయడంతో అక్కడ్నుంచి పరారయ్యాడు.

జరిగిన విషయం బాలిక తల్లికి తెలపగా వారు చిలకారావును ప్రశ్నించారు. నిందితుడి కుటుంబసభ్యులు బాధితురాలి కు టుంబసభ్యులతో కర్రలతో దాడి పాల్పడ్డారు.

దాడిలో తిరుపతిరావు, దుర్గారావు, సాయికుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు. ఘటన జరిగి 24 గంటలైనా సకాలంలో పోలీసులు స్పందించకపోవడంతో స్థానిక టీడీపీ నేత కొలికపూడి శ్రీనివాసరావు బాధితులతో కలిసి పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు నిందితునిపైన, దాడి చేసిన వారిపైన కేసులు నమోదు చేసి చర్యలు తీసుకునేందుకు పూనుకున్నారు. కార్యక్రమంలో పిట్టా చైతన్య, హరిబాబు, డేవిడ్‌రాజు, చందు, పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణా జిల్లాలో ఈవీఎంలు భద్రం..

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణా జిల్లాలో సోమవారం పోలింగ్ ప్రశాతంగా ముగిసింది. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది. ఫలితాలకు 19రోజుల వరకు వేచిచూడాలి. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ పూర్తయిన తరువాత ఈవీఎంలు, ఇతరత్రా పత్రాలను ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు. పోలీసులు భద్రంగా కృష్ణాయూనివర్సిటీకి తరలించారు. మంగళవారం ఉదయం ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచే కార్యక్రమం కొనసాగింది. కలెక్టర్ డీకే బాలాజీ పర్యవేక్షణలోఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌లకు వేసిన తాళాలపై సీళ్ల వేశారు. మిలటరీ దళాల పర్యవేక్షణలోకి వెళ్లింది.

జిల్లాలో పోలింగ్‌శాతం 84.45 నమోదు

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో తక్కువగా ఓటర్లు ఉన్న పెడన నియోజకవర్గంలో 88.57 అత్యధికంగా పోలింగ్‌శాతం నమోదైంది. అధికంగా ఓటర్లు ఉన్న పెనమలూరు నియోజకవర్గంలో 79.14శాతం మేర పోలింగ్ నమోదైంది.

ఎన్టీఆర్ జిల్లాలో ఓటు వేయని వారు 3,51,666 మంది

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 17,04,077 మంది ఓటర్లకు గాను సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు-2024లో 13,52,411 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 3,51,666 మంది ఓటుకు దూరంగా ఉన్నారు. ఈ ఎన్నికలలో 85శాతం మేర పోలింగ్ నమోదవుతుందనుకుంటే.. 79.36 శాతం మాత్రమే నమోదైంది. ఈసారి బయటి నుంచి వచ్చిన వారి ఓటింగ్ శాతం పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో గణనీయంగా ఓటర్ల అనాసక్తి వల్ల కూడా ఈ ప్రభావం కనిపిస్తోంది.

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా పోలింగ్ శాతం

నియోజకవర్గం	2019	2024	వ్యత్యాసం
తిరువూరు	86.07	87.63	+ 1.56
విజయవాడ వెస్ట్	66.17	66.46	+ 0.29
విజయవాడ సెంట్రల్	65.73	72.96	+ 7.23
విజయవాడ ఈస్ట్	67.50	71.33	+ 3.83
మైలవరం	89.60	85.36	- 4.24
నందిగామ	88.01	87.56	- 0.45
జగ్గయ్యపేట	89.53	89.88	- 0.35
మొత్తం	78.94	79.36	+ 0.42

కృష్ణా జిల్లా వ్యాప్తంగా పోలింగ్ శాతం

గన్నవరం	85.57	84.88	- 0.69
గుడివాడ	80.57	82.51	+ 1.94
పెడన	87.74	88.57	+ 0.83
మచిలీపట్నం	80.78	81.91	+ 1.13
అవినగడ్డ	88.92	86	- 2.92
పామర్రు	87.16	88.11	+ 0.95
పెనమలూరు	79.88	79.14	- 0.74
మొత్తం	84.36	84.45	+ 0.09

కూటమి అభ్యర్థుల విజయం తథ్యం

» వల్లభనేని బాలశౌరి, కొల్లు రవీంద్ర



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కూటమి నేతలు

మచిలీపట్నం టౌన్, మే 14 : వైసీపీ నేతలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, కూటమి కార్యకర్తలపై దాడులకు పాల్పడినా ఎన్నికలు సజావుగా జరిగాయని, దీనికి పార్టీశ్రేణుల సహకారం అభినందనీయమని మచిలీపట్నం పార్లమెంటు నియోజక ఉమ్మడి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, అసెంబ్లీ నియోజక వర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఓటమి భయంతో జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలపై పేర్ని నాని అనుయాయులు దాడులు జరిపించారని వల్లభనేని బాలశౌరి ఆరోపించారు. వైసీపీ నాయకులు రెచ్చకొడుతున్నా కూటమి శ్రేణులు ఏ విధమైన వాగ్వివాదాలకు దిగకుండా పోలింగ్ ప్రశాతంగా జరిగేందుకు సహకరించారన్నారు. ఓటర్లు కసితో కూటమి అభ్యర్థులకు ఓటు వేసారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తామన్నారు. పార్లమెంటు పరిధిలో 83 పోలింగ్ శాతం నమోదుకావడం ఉమ్మడి అభ్యర్థుల విజయానికి సంకేతమన్నారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, పోలింగ్ ప్రారంభానికి గంట ముందు వచ్చి, రాత్రి 11 గంటల వరకు కొన్ని కేంద్రాల్లో ఓటర్లు ఓటు వేశారన్నారు. రాష్ట్రాలు దాటి ఉమ్మడి అభ్యర్థులకు ఓటు వేసేందుకు యువత పెద్ద సంఖ్యలో తరలి వచ్చారన్నారు. సుదూర ప్రాంతాల నుంచి లక్షలు ఖర్చు పెట్టి వచ్చారన్నారు. ఎన్ఆర్ఐ కటకం విజయమణి ఓటు వేసేందుకు వచ్చి గుండెపోటుతో మృతిచెందడం బాధాకరమన్నారు. గొడుగుపేట తదితర ప్రాంతాల్లో ఓటు వేసేందుకు మహిళలు రాత్రి 11 గంటల వరకు వేచి ఉండటం అభినందించదగ్గ విషయమన్నారు. పేర్ని కిట్టు అనుచరులు పోలింగ్ కేంద్రాల వద్ద అల్లర్లు చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారన్నారు. ప్రలోభాలకు తలొగ్గకుండా ప్రజలు స్వచ్ఛమైన తీర్పు ఇచ్చారని, జూన్ 4వ తేదీన ఉమ్మడి అభ్యర్థులు రాష్ట్ర వ్యాప్తంగా అధికారంలోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో కొనకళ్ల బుల్లయ్య, జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ, గోపు సత్యనారాయణ, మోటమర్రి బాబాప్రసాద్, లంకే నారాయణ ప్రసాద్, పిప్పళ్ల కాంతారావు, గుమ్మడి విద్యాసాగర్, వేము కోటేశ్వరరావు, వాలిశెట్టి తిరుమలరావు, జనసేన నాయకులు మాదివాడ రాము, వంపుగడల చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌లో రంగన్న, సింగన్నగూడేలు రికార్డు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 14 : బాపులపాడు మండలంలోని రంగన్నగూడెంలో గల (పోలింగ్ స్టేషన్) పీఎస్ నెం. 183 అత్యధికంగా 96.10శాతం ఓట్లు వినియోగించుకుని గన్నవరం నియోజకరవర్గంలోనే అత్యధిక శాతం పోలింగ్ రికార్డు సృష్టించారు. అధికారిక గణాంకాల ప్రకారం ఈ పీఎస్‌లో 616 ఓటర్లు ఉండగా 592మంది ఓటుహక్కు వినియోగించుకున్నట్లు సమాచారం. బాపులపాడు మండలంలోనే అత్యధిక ఓట్లు వినియోగించుకున్న గ్రామంగా సింగన్నగూడెం నమోదైంది. సింగన్నగూడెంలోని పోలింగ్ స్టేషన్ నెం. 184లో అత్యధికంగా 95.52శాతం ఓట్లు వినియోగించుకున్నారు. అధికారిక గణాంకాల ప్రకారం ఈ పీఎస్‌లో 1005 మంది ఓటర్లు కుగాను 960 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు.

మూడేళ్లయినా మూతే!

- 2021లో రూ. 21 లక్షలతో నిర్మించిన డిజిటల్ లైబ్రరీ భవనం
- కంప్యూటర్లు, ఫర్నీచర్, సాంకేతిక పరికరాల ఏర్పాటులో ప్రభుత్వ విఫలం
- పట్టించుకోని ఎమ్మెల్యే, ఇతర ప్రజా ప్రతినిధులు
- నిరుపయోగంగా భవనం
- పెదవి విరుస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులు



బాపులపాడులో నిర్మించిన డిజిటల్ గ్రంథాలయ భవనం

హనుమాన్‌జంక్షన్, మే 14 : మండల కేంద్రమైన బాపులపాడులో మూడేళ్ల కిందట లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన డిజిటల్ గ్రంథాలయ భవనం ప్రారంభోత్సవం చేయడం ప్రజాప్రతినిధులు మరిచారు. అందులో సమకూర్చాల్సిన సామగ్రిని సమకూర్చకుండానే ప్రారంభించినట్లుగా శిలాఫలకం కూడా ఏర్పాటు చేశారు. ఆరంభ శూరత్వంతో విద్యార్థులకు నేటి సాంకేతికత ద్వారా విజ్ఞానాన్ని అందించాలనే లక్ష్యంతో వైసీపీ ప్రభుత్వం 2021లో బాపులపాడు మండల పరిషత్ కార్యాలయం సముదాయం వద్ద జిల్లా గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో భవనం నిర్మించింది. దీనికి ఉపాధి హామీ పథకం నిధులు రూ.21లక్షలు కేటాయించింది. భవనం నిర్మించి మూడేళ్లు అవుతున్నా గ్రంథాలయానికి కావాలసిన కంప్యూటర్లు, పర్నీచరు, ఇతర సాంకేతిక పరికరాలను గ్రంథాలయ శాఖ సమకూర్చలేక పోయింది. దీంతో ఆ భవనం ప్రారంభోత్సవానికి నోచుకోక పరిషత్ కార్యాలయం సముదాయం వద్ద నిరుపయోగంగా మారింది. కాని అధికారికంగా ప్రారంభోత్సవం చేయకుండానే చేసినట్లుగా భవనంపై శిలాఫలకం ఏర్పాటు చేసుకున్నారు. భవనంపై వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీగా ఘనంగా పేరు కూడా రాశారు. నిత్యం ప్రజాప్రతినిధులు మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరవుతుంటారు. అధికారులు కూడా తరుచు కార్యాలయాలకు వచ్చి వెళుతుంటారు. స్థానిక ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కూడా ఆ భవనం ప్రారంభోత్సవం, అందులో ఏర్పాటు చేయాల్సిన పరికరాలు, ఫర్నీచర్ కల్పనపై తగిన శ్రద్ధ చూపించ లేదన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలో డిజిటల్ గ్రంథాలయ భవనం నిర్మించడంతో సివిల్స్, ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే పేద విద్యార్థులు ఎంతో ఆశపడ్డారు. వారి ఆశలు అడియాశలు అయ్యాయి. అంత్యంత ప్రతిష్ఠాత్మకంగా భవన నిర్మాణం జిల్లా గ్రంథాలయ శాఖ చేపట్టింది. జిల్లాలోనే మొదటిగా నిర్మించిన భవనం కూడా ఇదే కావడం గమనార్హం. సామగ్రిని సమకూర్చడంలో అలసత్వం ప్రదర్శిస్తున్న జిల్లా గ్రంథాలయ శాఖ అధికారుల తీరును ప్రజలు దుయ్యబడుతున్నారు. వేలేరులో కూడా ఈ ఏడాది మరో డిజిటల్ గ్రంథాలయం భవనం నిర్మించారు. దానిలో కూడా వస్తు సామగ్రిని సమకూర్చలేదు. లక్షలాది రూపాయలు ప్రజాధనాన్ని వెచ్చించి నిర్మించిన భవనాలు అక్కరకు రాకుండ పోతున్నాయని, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు పెదవి విరుస్తున్నారు.


గోసాల సెంటర్‌లో తాటిముంజెలు తింటున్న బోడె ప్రసాద్

టీడీపీ విజయకేతనం ఖాయం : బోడె

కంకిపాడు, మే 14 : సార్వత్రిక ఎన్నికలు పూర్తి కావడంతో టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. గోసాల సెంటర్‌లో తాటి ముంజెలు తింటూ కాసేపు సేద తీరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంతో పాటు నియోజకవర్గంలోనూ టీడీపీ విజయకేతనం ఖాయమన్నారు. వైసీపీ అభ్యర్థి పోలింగ్ కేంద్రాల్లో రౌడీయిజం సృష్టించి, ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. అయినా ప్రజలు నిర్భయంగా ఓటు వేశారని, గతంలో ఎన్నడూ లేని విధంగా పోలింగ్ శాతం నమోదు అయిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి


వేలేరులో సమావేశమైన మొదటిసారి ఓటు వేసిన యువకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 14 : రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందడంతో పాటు యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందని వేలేరు యువత పోలగాని పరశురామ్, మేకపోతుల వంశీ అన్నారు. వేలేరులో మొదటి సారి ఓటుహక్కును వినియోగించుకున్న 40 మంది మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తలుపుల గోపి, ధూళిపాళ్ల కోటేశ్వరరావు, పోలగాని సాయిపవన్, బాణావతుల గోపి, మస్తాన్, ఖాదర్‌బాషా, ప్రదీప్, పాండు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నూరుశాతం ఉత్తీర్ణత

గుణదల, మే 14: సీబీఎస్ఈ 10, 12 తరగతుల పరీక్ష ఫలితాల్లో నిడమానూరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నూరుశాతం ఉత్తీర్ణత సాధించిందని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎమ్.ఎస్.భువనేశ్వరన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 12వ తరగతిలో సైన్స్ స్ట్రీమ్ టాపర్స్‌గా వజావత్ రత్నరాజ్, సిరివెళ్ల జానీ అక్షయ, కామర్స్ స్ట్రీమ్ టాపర్స్‌గా వినుకొండ శ్రీనిధియ, నాగ శివ సాయి పెరియా సంకుల, హ్యూమనిటీస్ టాపర్‌గా కృతి భట్వాడ్, తహ్లీన్ షిఫానా నౌషదాలి నిలిచారని తెలిపారు. పదవ తరగతిలో పెరిషాజైన్, ఆర్య సర్కార్, మ్యాథ్స్, ఐటి సబ్జెక్ట్స్‌లో నలుగురు నూరు మార్కులు సాధించారని, పరీక్షల్లో టాపర్స్‌గా నిలిచిన వారిని పాఠశాల డైరెక్టర్స్ పరిమి పవన్ చంద్, కడియాల ప్రవీణ్ కుమార్, అకడమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ భాటియా అభినందించినట్టు పేర్కొన్నారు.


మద్యం షాపు వద్ద బారులు తీరిన మందుబాబులు

మద్యం షాపులు కిటకిట


ఉయ్యూరు, మే 14 : ఉయ్యూరులో మద్యం షాపులు మందుబాబులతో రద్దీగా కన్పించాయి. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా శనివారం నుంచి మద్యం షాపులు మూతపడ్డాయి. రెండు రోజులపాటు మద్యం లభ్యంకాక పోవడంతో షాపులు ఎప్పుడు తెరుస్తారా అని మంగళవారం ఉదయం నుంచి షాపులవద్ద పడిగాపులు పడి క్యూలో నిలబడి కొనుగోలు చేశారు. కాటూరు రోడ్డులో షాపులో కొనుగోలు చేసిన మద్యం రోడ్డుపక్కనే చెట్టునీడన కూర్చుని బహిరంగంగా సేవించడం విశేషం.

టీడీపీ నేత తుమ్మలపల్లికి సత్కారం


తుమ్మలపల్లిని సత్కరిస్తున్న స్థానిక టీడీపీ నాయకులు

కంకిపాడు, మే 14 : నియోజకవర్గంలో టీడీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేశారని ఆ పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బోడె ప్రసాద్ గెలుపునకు ప్రతి ఒక్కరూ విశేషంగా కృషి చేశారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు యలమంచిలి కిషోర్‌బాబు, పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, చలవాది రాజ, అన్నే రామారావు, బొర్రా వెంకట్, ఏనుగ జయప్రకాష్, సుబ్బారావు, షేక్ బాజి తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా జబర్లపూడి రోడ్డు



ఉయ్యూరు, మే 14 : మద్రివాడ నుంచి జబర్లపూడి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా తయారై ప్రమాదకరంగా ఉన్న పరిస్థితుల్లో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. విజయవాడ- మచిలీపట్నం జాతీ య రహదారి నుంచి గ్రామానికి ఈ రోడ్డుపైనే వెళ్లాలి. ఈనేపథ్యంలో పొడవునా ఉన్న గుంతల్లో ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. పొలాల్లో దూరంగా విసిరివేసినట్లు ఉండే జబర్లపూడి నుంచి బయటకు వెళ్లే రోడ్డు దుస్థితిని ప్రజా ప్రతినిధులకు తెలియజేసినా పట్టించుకున్న వారులేరని గ్రామస్థులు వాపోతున్నారు.

విద్యార్థినికి సైకిల్ అందజేత


విద్యార్థినికి సైకిల్ అందజేస్తున్న మానవత సభ్యులు

హనుమాన్‌జంక్షన్, మే 14 : స్థానిక గుడివాడ రోడ్డులోని జ్యోతి నగర్ జేఎంజే కాలేజీలో ఇంటర్ చదువుతున్న బాపులపాడు గ్రామానికి చెందిన పేద విద్యార్థిని వీర్ల మంగామణికి మానవత హనుమాన్ జంక్షన్ శాఖ మంగళవారం సైకిల్ అందజేసింది. విద్యార్థిని కాలేజీకి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్న విషయాన్ని విద్యార్థిని తల్లిదండ్రులు మానవత దృష్టికి తీసుకువచ్చారు. సంస్థ నిర్వాహకులు స్పందించి సైకిల్ ఏర్పాటు చేశారు. మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు చేతుల మీదుగా విద్యార్థినికి సైకిల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో శాఖ అధ్యక్ష కార్య దర్శులు కూరెళ్ల సుబ్బాచారి, కళ్లేపల్లి నారాయణరావు, పాటోలు గణేష్, వడ్డి రాజేశ్వరరావు, కొట్నాని రామచంద్రరావు, గంటా సత్యనారాయణ, దయాల ప్రభాకర్, చెక్కా సుబ్బారావు, మల్లికార్జున రావు, నారాయణరావు, నారగాని కొండల రావు తదితరులు పాల్గొన్నారు.

భగీరథుని స్ఫూర్తితో అభివృద్ధి సాధించాలి

మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్

ఉయ్యూరు, మే 14 : ఘోర తపస్సుతో ఆకాశ గంగను దివి నుంచి భువికి తీసుకువచ్చిన భగీరథ మహర్షి స్ఫూర్తి, దీక్షవలంతో సగరులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. భగీరథ మహర్షి జయంతి పురస్కరించుకుని సగర సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు జంపన వీర శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భగీరథుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టుదల, దీక్షకు భగీరథుని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి అజ్మతుల్లా, బీసీ సెల్ రాష్ట్ర కార్య దర్శి ఫణి, కగ్గా సాంబయ్య, కటారి తిరుమలరావు పాల్గొన్నారు.

యనమలకుదురులో..

పెనమలూరు : సగర వంశ మూలపురుషుడు భగీరథ మహర్షి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని సగర సాధికార జిల్లా అధ్యక్షుడు తాడిశెట్టి వీరాస్వామి ఆకాంక్షించారు. మంగళవారం వైశాఖ శుద్ధ సప్తమిన సగర వంశ మూల పురుషుడు భగీరథ మహర్షి జయంతి సందర్భంగా యనమలకుదురులో బీసీ నాయకులు శొంఠి శివరాంప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన భగీరథ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జంపన వీరశ్రీనివాస్, దుర్గాప్రసాద్, సయ్యద్ అజ్మతుల్లా, రాజులపాటి ఫణి, సాంబయ్య, చైతన్య, నాని, దండూరి శ్రీను, తాడిశెట్టి ప్రసాద్, ఆరేపల్లి దాసు, బూక్య రాజా, వాటపల్లి లీలాప్రసాద్, కటారి తిరుపతిరావు, వేము, అశోక్, జోజి, రాజా, కుటుంబరావు పాల్గొన్నారు.



భగీరథుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్.. యనమలకుదురులో..

టీడీపీ నేత ఆళ్లపై భౌతికదాడి అమానుషం


ఆళ్ల గోపాలకృష్ణను పరామర్శిస్తున్న కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 14 : ప్రజాస్వామ్యంలో మనుష్యులపై ఆటవికంగా భౌతిక దాడులు చేయడం అమానుషమని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. రంగన్నగూడెంలోని ఆళ్ల నివాసంలో మంగళవారం గోపాలకృష్ణను టీడీపీ నాయకులు, రైతు నాయకులతో కలిసి ఆయన పరామర్శించారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘ ఆదేశాలను పాటించాలే తప్ప భౌతికదాడులు చేయడం విచారకరమన్నారు. ఓటు హక్కు వినియోగించుకునే ప్రజలకు సేవలందించే విధంగా ఉండాలే తప్ప రాజకీయకక్షలతో దాడులు చేసుకుంటూ ప్రజల శాంతి భద్రతకు విఘాతం కలిగించకూడదని చలసాని అన్నారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ, గన్నవరం నియోజకవర్గంలో గతంలో ఎప్పుడూ ఇలాంటి భౌతిక దాడులు చూడలేదన్నారు. వైసీపీ నాయకులు మితిమీరి ప్రవర్తిస్తూ టీడీపీ శ్రేణులపై అక్రమ కేసులు పెట్టడంతో మొదలై భౌతికదాడుల చేయడం వరకూ వచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు తుమ్మల దశరధరామయ్య, వేగిరెడ్డి పాపారావు, గుండపనేని ఉమావరప్రసాద్, మండాది రవీంద్ర, వీరవల్లి పంచాయతీ పాలకవర్గ సభ్యుడు పిల్లా రామారావు, స్థానిక రైతులు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

పోరంకి అల్లర్లకు కారణమైన మంత్రి తనయుడిపై కేసు

పెనమలూరు, మే 14 : సాధారణ ఎన్నికల సందర్భంగా పోరంకి హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసి ఓట్ల ప్రక్రియను ప్రభావితం చేయడానికి ప్రయత్నించారంటూ మంత్రి జోగి రమేశ్ తనయుడు రాజీవ్, అనుచరులు ఆరేపల్లి రాము, మనోజ్‌లపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం నాటి పోలింగ్‌లో జరిగిన పరిణామాలపై పోలీసులు స్థానిక పోలింగ్ కేంద్రంలోని బూత్‌లలో జరిగిన ఎన్నికల విఘాత చేష్టలపై తీసుకొనే చర్యల్లో భాగంగా తగు చర్యలకు పోలీసులు ఉపక్రమించారు. పోలింగ్ సందర్భంగా బూత్‌లోని టీడీపీ ఏజెంట్లపై ఘర్షణకు దిగి ఎన్నిక జరుగుతున్న ప్రాంతంలో ఘర్షణ వాతావరణానికి కారకులయ్యారంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు మంత్రి జోగి, తనయుడు రాజీవ్, అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

విలేకరిపై దాడి.. కేసు నమోదు

సాధారణ ఎన్నికల సందర్భంగా పోరంకి ఉన్నత పాఠశాల వద్ద వైసీపీ గూండాలు జరిపిన అల్లర్ల సందర్భంగా జరిగిన దాడిలో గాయపడ్డ విలేకరి మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకొంటామని సీఐ రామారావు తెలిపారు.

హనుమజ్జయంతికి ఏర్పాట్లు

హనుమాన్‌జంక్షన్, మే 14 : స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 27 నుంచి జూన్ 1 తేదీ వరకు నిర్వహించనున్న 23వ హనుమజ్జయంతి ఉత్సవాలకు సంబంధించి ఏర్పా ట్లు ముమ్మరం చేస్తున్నారు. గత నెల 18న ఉత్సవ ముహూర్తం రాట ప్రతిష్ఠ చేసిన విషయం తెలిసిందే. ఆలయం వెనుక భాగంలో భారీస్థాయి పందిరి, ఆలయం ముందు భాగంలో మరో పందిరి, విద్యుత్ దీపాలతో భారీ కటౌట్ల నిర్మాణాలు చేపట్టారు. అధికార పార్టీకి చెందిన ఆలయ పాలక మండలి పదవి కాలం గత కొద్ది నెలల క్రితం ముగిసింది. ఈ ఉత్సవ నిర్వహణ గ్రామ పెద్దల సహకారం తీసుకొని నిర్వహించనున్నారు. ఉత్సవ నిర్వహణకు రూ.11లక్షలు దేవదాయ శాఖ మంజూరు చేసినట్లు ఆలయ ఈవో కె. శ్రీనివాస్ తెలిపారు. ఎప్పటిలాగానే ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో తెలిపారు.


ఆలయ వెనుక భాగంలో ఉత్సవ పందిరి నిర్మాణ పనులు

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	150, 159, 170
చికెన్ విత్ స్కిన్	290
చికెన్ స్కిన్‌లెస్	300

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.40

టీడీపీ అధికారంలోకి రావడం తథ్యం : కుమార్ రాజా



పామర్రు : ప్రజాభీష్టం మేరకు రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావటం ఖాయమని పామర్రు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వర్లకుమార్‌రాజా అన్నారు. నియోజకవర్గంలోని పార్టీ ముఖ్యులతో చర్చించిన అనంతరం మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో మార్పును కోరుతున్న ప్రజలు అప్రజాస్వామిక పాలనకు చరమగీతం పాడనున్నారన్నారు. చంద్రన్న రాష్ట్ర ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల వాగ్దానాలు తప్పక అమలు చేస్తారనే నమ్మకం ప్రజల్లో కలిగిందన్నారు. నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, ఐదు మండలాలకు చెందిన టీడీపీ నేతలు పాల్గొన్నారు.



పునాదుల్లోనే ఆగిపోయిన ఆర్డీవో కార్యాలయ భవనం



పిచ్చిమొక్కలు మొలిచిన తహసీల్దార్ కార్యాలయం పునాదులు



నగరపాలక సంస్థ కార్యాలయ భవన నిర్మాణం దుస్థితి

పునాదుల స్థాయిలోనే రెవెన్యూ భవనాలు!

- రెవెన్యూ సిబ్బంది, ప్రజలకు ఇబ్బందులు
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన
- ఆరేళ్లుగా పూర్తికాని భవనాల నిర్మాణం
- కొత్తగా ఏర్పడే ప్రభుత్వం దృష్టి సారించాలి

(మచిలీపట్నం టౌన్)

అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆరేళ్లుగా జిల్లా కేంద్రం మచిలీపట్నంలో రెవెన్యూ భవనాల నిర్మాణ పనులు పునాదుల్లోనే నిలిచిపోయాయి. బ్రిటీషు కాలం నాటి రెవెన్యూ భవనాలు శిథిలమైన నేపథ్యంలో 2018 ఆగస్టు 28న అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం మారి వైసీపీ ప్రభుత్వం వచ్చి రివర్స్ టెండరింగ్ పేరుతో భవనాల నిర్మాణానికి గండికొట్టింది. వైసీపీ ప్రభుత్వం కొర్రీల కారణంగా భవనాల నిర్మాణం పూర్తి కాక పోవడతో రెవెన్యూ అధికారులతో పాటు కార్యాలయాలకు వచ్చే ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. శిథిల భవనాల్లో రెవెన్యూ కార్యాలయాలు కొనసాగుతుండడంతో వర్షం వస్తే ఫైళ్లు తడిచిపోతున్నాయి.

కృష్ణాజిల్లా కేంద్రం మచిలీపట్నంలోని కలెక్టరేట్‌లో ఉన్న ఆర్డీవో కార్యాలయం భవనాలు బ్రిటీషు కాలం నాటివి కావడంతో శిథిల స్థితికి చేరాయి. అలాగే బస్టాండ్ సమీపంలోని తహసీల్దార్ కార్యాలయం కూడా బ్రిటీష్ హయాంలో నిర్మించింది కావడంతో బంగాళా పెంకులు లేచిపోయి శిథిల స్థితికి చేరింది. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో కలెక్టరేట్‌లో ఆర్డీవో పాత భవనం వెనుక కొత్త భవనం నిర్మాణానికి, బస్టాండ్ సమీపంలోని పాత తహసీల్దార్ కార్యాలయం వెనుక నూతన తహసీల్దార్ కార్యాలయ భవనాలను నిర్మించే లక్ష్యంతో శంకుస్థాపనలు చేశారు. 2018 ఆగస్టు 28వ తేదీన అప్పటి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, అప్పటి న్యాయ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర, అప్పటి ఎంపీ కొనకళ్ల నారాయణరావు భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ. 90 లక్షలు నిధులు కేటాయించారు. వైసీపీ ప్రభుత్వం పుణ్యమా అంటూ పునాదుల్లోనే తహసీల్దార్ కొత్త కార్యాలయ భవనం నిలిచిపోయింది. ఆర్డీవో కార్యాలయ భవన నిర్మాణానికి రూ. 2 కోట్ల 25 లక్షల నిధులు కేటాయించారు. రూ.40 లక్షల ఖర్చుతో కొంత మేర పనులు చేశారు. వైసీపీ ప్రభుత్వం కారణంగా అదీ నిలిచిపోయింది. మచిలీపట్నం నగర పాలక సంస్థ కార్యాలయం కొత్త భవనం నిర్మాణానికి రైల్వే స్టేషన్ సమీపంలో 2016 ఏప్రిల్ 30న అప్పటి పురపాలక శాఖామంత్రి డాక్టర్ పి.నారాయణ, మంత్రి కొల్లు రవీంద్ర, అప్పటి ఎంపీ కొనకళ్ల నారాయణరావు, మునిసిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం మారడంతో ఆ భవన నిర్మాణ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. వైపీపీ ప్రభుత్వం అధికారులు ఈ భవన నిర్మాణాలపై దృష్టి సారించక పోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. కొత్తగా ఏర్పడే ప్రభుత్వం అయినా రెవెన్యూ, నగరపాలక కార్యాలయ భవనాల పూర్తికి చొరవచూపి రెవెన్యూ సిబ్బంది, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కేంద్రీయ విద్యాలయం టెన్త్ టాపర్ అపూర్వ



చల్లపల్లి, మే 14 : సీబీఎస్ఈ - 2024 పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మచిలీపట్నం కేంద్రీయ విద్యాలయం టాపర్‌గా చల్లపల్లికి చెందిన రేవళ్ల అపూర్వ ప్రతిభను చాటింది. సీబీఎస్ఈ ఫలితాలు సోమవారం విడుదల కాగా, చల్లపల్లిలోని సాయినగర్ కాలనీకి చెందిన అపూర్వ 90 శాతం మార్కులతో ప్రథమ స్థానం సాధించింది. అపూర్వ తల్లిదండ్రులు విజయ్, అరుణ కేంద్రీయ విద్యాలయంలో కంప్యూటర్, సోషల్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ప్రతి రోజూ తల్లిదండ్రులతో కలిసి మచిలీపట్నం కేంద్రీయ విద్యాలయానికి వెళ్లి అపూర్వ విద్యనభ్యసించింది. ఇంగ్లీషు ప్రొఫెసర్‌గా స్థిరపడాలన్నది లక్ష్యమని అపూర్వ తెలిపింది.

బందరు నియోజకవర్గంలో 81.91 శాతం పోలింగ్

మచిలీపట్నం టౌన్, మే 14 : మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో 81.91 శాతం పోలింగ్ నమోదైంది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 11.30 గంటల వరకు పోలింగ్ జరిగింది. గాంధీ విద్యాలయం, జైహింద్ హైస్కూల్‌తో పాటు బందరు రూరల్ మండలం పెదకరగ్రహారం, పల్లెతుమ్మలపాలెం గ్రామాల్లో రాత్రి 11.30 గంటల వరకు పోలింగ్ జరిగింది. ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ముగిసింది. మచిలీపట్నంలో 205 పోలింగ్ కేంద్రాల్లో 1,96,680 మంది ఓటర్లకు 1,61,109 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 78,103 మంది, మహిళలు 83,001 మంది ఓటు వేశారు. 38 పోలింగ్ కేంద్రాల్లో అత్యధికంగా 90 శాతం పోలింగ్ నమోదైంది. 18వ పోలింగ్ కేంద్రంలో 96 శాతం, 16, 17, 37 పోలింగ్ కేందాల్లో 95 శాతం పోలింగ్ నమోదయింది.

మోపిదేవి మండలంలో 88 శాతం..

మోపిదేవి : మండలం 88.85 శాతం ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో 28,790 మంది ఓటర్లు ఉండగా, 25,580 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 38 పోలింగ్ కేంద్రాలు ఉండగా, అత్యధికంగా కె.కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని 103 నెంబరు పోలింగ్ కేంద్రం దళితవాడలో 94.02 శాతం ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ పోలింగ్ కేంద్రంలో 719 మంది ఓటర్లు ఉండగా, 676 మంది ఎండను సైతం లెక్కచేయకుండా వృద్ధులు, వికలాంగులు, మహిళలు పెద్ద ఎత్తున ఓటు హక్కును వినియోగించుకున్నారు. అత్యల్పంగా మోపిదేవి పంచాయతీ పరిధిలోని 110 పోలింగ్ కేంద్రంలో 83.28 శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ పోలింగ్ కేంద్రంలో 891 మంది ఓటర్లు ఉండగా, 742 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

చల్లపల్లి మండలంలో 83.24 శాతం..

చల్లపల్లి : మండలంలో 83.24శాతం ఓటింగ్ నమోదైంది. మండలంలో మొత్తం ఓటర్లు 42వేల 832 కాగా, 35 వేల 657 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

చల్లపల్లిలో 15 పోలింగ్ బూత్‌లు ఉండగా, వాటిలో 13 వేల 196 మందికి 10,454 మంది ఓటు వేయటంతో 79.22 శాతం పోలింగ్ నమోదైంది. వెలివోలులోని 46వ బూత్‌లో 520 మందికి 486 మంది ఓటు హక్కు వినియోగించుకోవటం ద్వారా అత్యధికంగా 93.46 శాతం నమోదైంది. అదే గ్రామంలో 45వ బూత్‌లో 92.12 శాతం, పచ్చార్లంకలోని 94వ బూత్‌లో 62 మందికి 56 మంది ఓటువేయగా 90.32 ఓటింగ్ శాతం, పాత నడకుదురులోని 52వ బూత్‌లో 807 మందికి 727 మంది ఓటు వేయటం ద్వారా 90.09 శాతం ఓటింగ్ నమోదైంది. చల్లపల్లిలో 79.22శాతం, లక్ష్మీపురంలో 81.49 శాతం, మాజేరులో 85.86 శాతం, మంగళాపురంలో 84.97శాతం, వక్కలగడ్డలో 85.33 శాతం, పాగోలులో 88.18 శాతం, వెలివోలులు 92.67 శాతం, పురిటిగడ్డలో 86.65 శాతం, నడకుదురులో 86.91 శాతం, యార్లగడ్డలో 90.39 శాతం, ఆముదార్లంకలో 87.10 శాతం చొప్పున పోలింగ్ నమోదైంది.

గుడివాడ నియోజకవర్గంలో 82.51 శాతం పోలింగ్

గుడివాడ : సార్వత్రిక ఎన్నికల్లో గుడివాడ నియోజకవర్గంలో ఓటింగ్ శాతం భారీగా పెరిగింది. 2019 ఎన్నికల్లో 66 శాతం ఓట్లు పోలవ్వగా, 2024 ఎన్నికల్లో 82.51 శాతం ఓట్లు పోలయ్యాయి, 16.51 శాతం ఓటింగ్ పెరిగడం గమనార్హం. మొత్తం 2,04,027 ఓటర్లకు గాను 1,68,537 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు., 81,119 పురుషులు, 87,408 మహిళలు, 10 మంది ట్రాన్స్‌జెండర్‌లు ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో ఉన్నారు.



చెన్నమల్లిఖార్జునస్వామి కల్యాణోత్సవాలు 18 నుంచి

విశ్వదాత అవార్డుల ప్రదానం 20న

పామర్రు : ఎలకుర్రు అగ్రహారంలో వేంచేసి భ్రమరాంబ సమేత చెన్నమల్లిఖార్జునస్వామి 264వ కల్యాణ మహోత్సవాలు ఈనెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు వ్యవస్థాపక ధర్మకర్త కాశీనాధుని నాగేశ్వరరావు తెలిపారు. 18న అంకురార్పణతో ప్రారంభమై వేదపఠనం, సహస్ర నామార్చన, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, నిత్యాఔపోసన, బలిహరణ, సాయంత్రం ధ్వజారోహణ అనంతరం శ్రీకృష్ణతులాభారం నృత్య ప్రదర్శన ఉంటాయన్నారు. 19న ఉదయం వేదపఠనం, సహస్రనామార్చన, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, నిత్యఔపోసన, బలిహరణ, రామాంజనేయ యుద్ధం (యుద్ధసన్నివేశం) ప్రదర్శన, 20న వేదపఠనం, సహస్రనామార్చన, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, నిత్య ఔపోసన, బలిహరణ, విశ్వదాత అవార్డుల ప్రదానోత్సవం, 21న సహస్రనామార్చన, విశేష పూజలు, బాలసరస్వతి నాట్యమండలి వారిచే సత్యహరిశ్చంద్ర నాటకం, అర్ధరాత్రి స్వామి వారి కల్యాణ మహోత్సవం, 22న విశేష పూజలు, 23న అన్నసమారాధన, ఏకాదశ ప్రదక్షిణలు, త్రిశూలస్థానం, అన్నసమారాధన జరుగుతాయన్నారు.





అయ్యప్ప స్వామికి విశేష పూజలు

మచిలీపట్నం టౌన్ : ధర్మశాస్తా భక్త బృందం ఆధ్వర్యంలో మంగళవారం గాంధీబొమ్మ శివాలయంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. లక్ష్మీగణపతి హోమం, లలితా హోమం జరిపారు. లలితా సహస్ర నామ పారాయణ జరిగింది. లక్ష మల్లెలతో స్వామి వారికి అర్చనలు జరిపారు. సువాసినులు భగవతి సేవ జరిపారు. అయ్యప్పస్వామికి అష్టదళ సువర్ణ పుష్పార్చన చేశారు. విశాఖ శారదాపీఠ పాలిత అయ్యప్ప దేవాలయంలో డి.ఎస్.వి. రాంబాబు ఆధ్వర్యంలో సేవలు జరిగాయి.



వైభవంగా సాయిబాబా పల్లకీ సేవ

బంటుమిల్లి : బస్టాండ్ సమీపాన వేంచేసియున్న సాయిబాబా ఆలయం ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి పుర వీధులలో పల్లకి సేవ వైభవంగా జరిగింది. సాయినామ భజన మార్మోగింది.

ధాన్యం పురి దగ్ధం



అవనిగడ్డ రూరల్ : అశ్వారావుపాలెంలో బాణసంచా కారణంగా ముద్దినేని చంద్రశేఖర్ వడ్లపురి దగ్ధం అయ్యింది. రూ.50 వేల నష్టం వాటిల్లింది. అగ్నిమాపక అధికారి ప్రసాద్ సిబ్బందితో వచ్చి మంటలను అదుపు చేశారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రామకృష్ణయ్య

చట్టాలపై అవగాహన అవసరం

మచిలీపట్నం టౌన్ : చట్టాలపై న్యాయవాదులు అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వి.రామకృష్ణయ్య అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మచిలీపట్నం న్యాయవాదుల సంఘ భవనంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. మచిలీపట్నం న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో రామకృష్ణయ్య మాట్లాడుతూ, న్యాయవాదులకు చట్టంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. శాశ్వత లోక్‌అదాలత్ అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ చట్టంలోని విశేషాలను వివరించారు. సీనియర్ న్యాయవాదులు అజ్మతున్నీసా, గరిమెళ్ళ ప్రభాకర్, లంకిశెట్టి బాలాజీ తదితరులు మాట్లాడారు.



ఏలూరురోడ్డులోని మద్యం దుకాణం వద్ద బారులు తీరిన మందుబాబులు

మద్యం దుకాణాలు కిటకిట

గుడివాడ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మూడు రోజుల పాటు మద్యం దుకాణాలను ఎన్నికల కమిషన్ మూయించింది. దీంతో మందుబాబులు అల్లాడిపోయారు. మూడు రోజులపాటు రాజకీయ పార్టీల నాయకులు విపరీతంగా మద్యం సరఫరా చేసినా సరిపోలేదు. దీంతో మంగళవారం ఏలూరురోడ్డులోని ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద మందుబాబులు బారులు తీరారు.



నిరుపేద కుటుంబానికి సాయం

అవనిగడ్డ రూరల్ : రామచంద్రాపురంలోని నిరుపేద ఎరుకుల కుటుంబానికి చెందిన కందుల వెంకటేశ్వరరావు వారం క్రితం మృతి చెందాడు నిరుపేద కుటుంబం కావటంతో, ఉపాధి హామీ పథకం కూలీగా కూడా పని చేస్తున్నాడు. పెద్దకర్మ నిమిత్తం వీర రాఘవయ్య, వాకా సముద్రాలు ఉపాధి కూలీలు కలిసి మంగళవారం ఆ కుటుంబానికి రూ.13 వేల, రూ.40 కేజీల బియ్యం అందజేశారు. పాస్టర్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పోరంకి అల్లర్లపై మంత్రి జోగి రమేశ్ తనయుడిపై కేసు

పెనమలూరు, మే 14 : సాధారణ ఎన్నికల సందర్భంగా పోరంకి హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసి ఓట్ల ప్రక్రియను ప్రభావితం చేయడానికి ప్రయత్నించారంటూ మంత్రి జోగి రమేశ్ తనయుడు రాజీవ్, అనుచరులు ఆరేపల్లి రాము, మనోజ్‌లపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం నాటి పోలింగ్‌లో జరిగిన పరిణామాలపై పోలీసులు స్థానిక పోలింగ్ కేంద్రంలోని బూత్‌లలో జరిగిన ఎన్నికల విఘాత చేష్టలపై తీసుకొనే చర్యల్లో భాగంగా తగు చర్యలకు పోలీసులు ఉపక్రమించారు.

పోలింగ్ సందర్భంగా బూత్‌లోని టీడీపీ ఏజెంట్లపై ఘర్షణకు దిగి ఎన్నిక జరుగుతున్న ప్రాంతంలో ఘర్షణ వాతావరణానికి కారకులయ్యారంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు మంత్రి జోగి, తనయుడు రాజీవ్, అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేశారు.